

పేదలకు భూ పట్టాలివ్వాలి

ఒంటిమిట్ట : మండలంలోని ఒంటిమిట్ట, ముకుందాపురం, మాధవరం గ్రామాలకు చెందిన 150 మంది పేదలకు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 2050 ప్రభుత్వ భూమిలో పట్టాలు ఇవ్వాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు కె. నరసయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడేళ్లుగా ఆముదం, ఉలవ పంటలు సాగు చేసుకుంటున్న పేదలకు భూమిని సర్వే చేసి సెటిల్మెంట్ కమిటీ జాబితాలో అర్హులుగా గుర్తించాలని చెప్పారు. ఒంటిమిట్ట మండల కేంద్రంలోని అర్హులైన 56 కుటుంబాలు పేదలకు 22, 13 సర్వే నెంబర్లలో ఇంటి పట్టాలివ్వాలని, ఇంతవరకు స్థలాలు చూపించకపోవడం అన్యాయమని చెప్పారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్థలాలు చూపించాలని చెప్పారు. అనంతరం తహశీల్దార్ మాధవిలతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పేదలు పాల్గొన్నారు.

పులివెందులను గుండెల్లో పెట్టుకుంటా



ఇక్కడికి నీళ్లు తెచ్చిన ఘనత నాదే

'సీమ'ను రతనాలసీమగా మారుస్తా

ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధంలో చంద్రబాబు వెల్లడి



అసంపూర్తిగా ఉన్న సిబిఆర్ పనులను పరిశీలిస్తున్న చంద్రబాబు

పులివెందుల బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/రూరల్/జమ్మలమడుగు రూరల్

రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం జమ్మలమడుగు నుంచి పులివెందుల వరకు రోడ్ షో నిర్వహించారు. గండికోట రిజర్వాయర్‌ను చంద్రబాబు సందర్శించారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్టు వద్ద ఆగిన పనులను కొండలపైకి నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. రాత్రి ఎనిమిది గంటలకు పులివెందులకు చేరుకున్న రోడ్‌షోకు ప్రజల బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పులివెందుల నాదని, గుండెల్లో పెట్టి చూసుకుంటానని మ తెలిపారు. పులివెందులకు నీళ్లు తెచ్చిన ఘనత తనదేనన్నారు.

పులివెందులలో వచ్చిన ఉత్సాహం చూస్తుంటే తిరు గుబాటు కనిపిస్తుందని తెలిపారు. చేసిన పాపాలు ఎక్కడికీ పోవు అవే ఇప్పుడు శాపాలుగా మారుతాయని అన్నారు. ప్రజలను చూసైన తాడేపల్లి నేతల్లో మార్పురావాలని పేర్కొన్నారు. కృష్ణా జలాలను పులివెందులకు తెచ్చిన ఘనత మాదేనన్నారు. ఆర్టికల్స్ అబ్బుగా పులివెందుల తీర్చు దువుతానని, నీరు ఉంటే సిరులు పండించవచ్చు అన్నారు. 2015లో పులివెందుల ప్రాంత రైతుల చీనీ పంటలు ఎండి పోతుంటే గండికోటకు రెండు టిఎంసిల నీళ్ల ఇచ్చి రైతుల ఆనందాన్ని నింపామన్నారు. పట్టిసీమను నిర్మించడం వల్లే రాయలసీమకు నీళ్ల అందుతున్నాయన్నారు. ప్రాజెక్టుల కోసం టిడిపి ఐదేళ్ల పాలనలో రూ.68 వేల కోట్లు ఖర్చుపెడితే వైసిపి రూ.22 వేల మాత్రమే ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. రాయలసీమకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేయడం జరి గిందని, వైసిపి కేవలం రూ.రెండు వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. సింహం ఎప్పటికైనా సింహమేనని పేర్కొన్నారు. నాతో పెట్టుకుంటే తొక్కుకుంటూ పోతానని, రాజధాని లేకుండా చేసిన వ్యక్తి జగన్ అని, పోలవరం ప్రాజెక్టు పనులు నిలిచిపోవడానికి కారణం జగన్ అన్నారు. బాబాయిని చంపి డ్రామాలాడుతున్నారని జగన్మోహన్ రెడ్డిపై ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి వివేక కుమార్తె సునీత పోరాటంపై ప్రశంసలు కురిపించారు. నీటిపారుదల మంత్రి ఒక ఆంబోతు మంత్రి అని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చేసే సౌకర్యం కల్పిస్తామన్నారు. నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.3 వేల ఇస్తామన్నారు. పులివెందులలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని బాధ్యత మీ అందరి పైన ఉందని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, బిటెక్ రవి, నాయకులు సిఎం.సురేష్ నాయుడు పాల్గొన్నారు.

పులివెందులలో తీవ్ర ఉద్రిక్తత

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో ఉద్రిక్తత నెలకొంది. చంద్రబాబు పర్యటన ప్రారంభం కానుండగా పులివెందులలోని పూలంగళ్ల సర్కిల్ వద్దకు భారీ సంఖ్యలో టిడిపి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. అక్కడ అలజడి సృష్టించేందుకు వైసిపి శ్రేణులు యత్నించాయి. వైసిపి జెండాలు పట్టుకుని కారులో వెళుతున్న ముగ్గురు కార్యకర్తలు జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ టిడిపి శ్రేణులు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఆగ్రహానికి గురైన టిడిపి కార్యకర్తలు వెంటపడి తరమడంతో అక్కడి నుంచి వైసిపి కార్యకర్తలు వాహనంలో పరారయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు. రెండు గ్రూపులను చెదరగొట్టి వారిపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ ఘటనతో పులివెందులలో ఉద్రిక్తత నెలకొంది.

చికెన్ కొట్లల్లోనూ ఎమ్మెల్యే వసూళ్లు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

స్థానిక ఎమ్మెల్యే చివరకు చికెన్ కొట్లల్లోనూ వసూళ్లు చేస్తున్నారని, ఇలాంటి ఎమ్మెల్యే ఇక్కడ ఉన్నందుకు సిగ్గుండాలన్నారు. బుధవారం స్థానిక కోవెలకుంట్ల రోడ్డు నుండి పాత బస్టాండ్ వరకు భూపేష్‌రెడ్డితో కలిసి నారా చంద్రబాబు నాయుడు రోడ్ షో నిర్వహించారు. ప్రజలు టిడిపి కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలు మేలు చేసే ఆలోచనల్లో జగన్ లేదని ఎద్దేవా చేశారు. జమ్మలమడుగు ఇసుక హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు తరలిపోతుందని తెలిపారు. 2024లో భూపేష్‌రెడ్డిని గెలిపించి జమ్మలమడుగు అభివృద్ధికి కారకులు కావాలన్నారు. ప్రతి నిరుద్యోగ యువతకు ఉపాధి కలిపిస్తానని, రైతుతో పాటు అందరినీ అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు.



జమ్మలమడుగు రోడ్‌షోలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

మహిళలపై పెరుగుతున్న హింస

హింసపై మహిళల పోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి



కడప : మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి

ప్రజాశక్తి-బద్వేలు/కడప అర్బన్/ప్రొద్దుటూరు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలు, చిన్నారులపై రోజురోజుకూ దాడులు, హింస విపరీతంగా పెరిగిపోతున్నాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. మహిళల రక్షణ కోసం ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరుయాత్ర రాష్ట్ర జాతా బుధవారం నెల్లూరు జిల్లా నుంచి కడప జిల్లాలోకి ప్రవేశించింది. బద్వేలు, కడప, మైదుకూరు మీదుగా ప్రొద్దుటూరు వరకు సాగింది. ఆయా ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. బద్వేల్లో ఐద్వా జిల్లా కడప జిల్లా కార్యదర్శి ఐ.ఎన్.సుబ్బమ్మ జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని, హింస లేని సమాజం కోసం చేయి చేయి కలుతుదామని తెలిపారు. మహిళల రక్షణే తమ లక్ష్యం అంటూ గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం చట్టాలను చేయడం కాదు ఆ చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని, దేశంలోనూ, రాష్ట్రంలోనూ చిన్నారులపై, మహిళలపై హింస రోజు రోజుకి విపరీతంగా పెరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలు హింసకు గుర వుతున్నారన్నారు. మహిళా రక్షణ కోసం తీసుకొచ్చిన పోక్సో చట్టాన్ని ఎత్తి వేయడానికి ప్రయత్నాలు చేస్తు న్నార న్నారు. మత్తు, మద్యం వల్లే నిత్యం మహి ళలు హింసకు, దాడులకు గురవు తున్నా రని వీటిని సంపూర్ణంగా నిషేధిం చాల న్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే దశల వారీగా మద్య నిషేధం చేస్తామని చెప్పా రని పేర్కొన్నారు. మద్య నిషేధ చట్టాన్ని తీసుకురాక పోగా మత్తు పదార్థాలను విచ్చలవిడిగా దొరికే విధంగా చేశార న్నారు. బిజెపి ప్రభుత్వం దేశాన్ని, దేశ సంపదను, ఖనిజాలను అదాని, అంబా నీలకు దారాదత్తం చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దుచేసి కాశ్మీర్ భూములపై అదాని, అంబానీల పెత్తనం చెలాయించే విధంగా చేశారన్నారు. మణిపూర్‌లో ఆదివాసులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపద ఉందని తెలుసుకొని ఆ సంపదను అదానికి దోచిపెట్టడానికి దేశ ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్ పేరుతో కులాల మధ్య చిచ్చు రేపి హత్యలు హత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. మహిళల డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో రెండు ప్రాంతాల నుంచి పోరు యాత్రను చేపట్టామన్నారు. ఈ నెల 8న విజయవాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి మహిళల పోరు ఏమిటన్నది ప్రభుత్వాలకు చూపిస్తామన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా ఐద్వా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు మేడా గౌతమి, పట్టణ అధ్యక్షులు గంప అనంతమ్మ, ప్రధాన కార్యదర్శి రత్తమ్మ, పట్టణ నాయకులు బాలమ్మ, మస్తాన్ బి.మోక్షమ్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, గంగనపల్లె నాగార్జున, మహిళా కన్వీనర్ సి.గురుదేవీ, పట్టణ నాయకులు ఆంజనేయులు, సురేష్, సురేంద్ర, సిఐటియు నాయకులు రాజగోపాల్, కాకర్ల బాబయ్య పాల్గొన్నారు.



కడప : మహిళా కళాకారుల నృత్య ప్రదర్శన

అవిశ్వాస తీర్మానంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

మణిపూర్ సంఘటనలపై పార్లమెంటులో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన తమ వైఖరిని ప్రకటించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. కడప బాలికల కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలను సిఎం జగన్మోహన్‌రెడ్డి అక్కలు, చెల్లెలుకు అండగా ఉంటారా లేదా అనేది స్పష్టం చేయాలన్నారు. టిడిపి తట స్థంగా ఉంటామనడం అంటే గోడమీద పిల్లి లాంటి వేషాలేనని విమర్శించారు. జనసేన ప్రశ్నించేందుకే ఉంది అంటున్న పవన్ కళ్యాణ్ మణిపూర్ హత్యలు హత్యాచారాలపై ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో అదృశ్యమైన మహిళలను ఎంత మందిని గుర్తించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంతమందికి పునరావాసం కల్పించారు చెప్పాలన్నారు. జెవివి సమతా విభాగం నాయకులు సునీత మాట్లాడుతూ విద్యార్థినులు సమాజంలో చోటు చేసుకుంటున్న సంఘటనపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి టి.సావిత్రమ్మ, జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్. సుబ్బమ్మ, నగర కార్యదర్శి జమీల, నాయకులు శంషాద్, కామేశ్వరమ్మ, అనంతమ్మ, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి, కళాజాత బృందం, కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతోనే రక్తహీనత నివారణ

ప్రజాశక్తి-కలసపాడు



కలసపాడు: బాలింతలు, గర్భిణులతో ప్రజాప్రతినిధులు

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారానే రక్తహీనతను నివారిం చవచ్చని బద్వేల్ నియోజకవర్గ శాసన సభ్యురాలు, డాక్టర్ సుధా తెలిపారు. బుధవారం మండ లంలోని ముద్దంవారిపల్లిలో బాలింతలకు గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో సర్పంచ్ అంకన, గోవిందమ్మ, ఎంపిడిఒ మహబూబ్‌బీ, జడ్‌పిటిసి అంకన గురువిరెడ్డి, ఎంపిపి బోధనబోయిన నారాయణ, రాజుపాలెం సర్పంచ్ సుధా, రామకృష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు, పెద్దిరెడ్డి పురుషోత్తంరెడ్డి, జెసిఎస్ మండల కన్వీ నర్ చిత్త రాజశేఖర్ రెడ్డి, లిడ్ క్యాప్ డైరెక్టర్, సగిలి సుదర్శన్, సొసైటీ డైరెక్టర్ జె.సింగరయ్య, చింతలపల్లి ఎంపిటిసిలు వావిళ్ళ మల్లికా గురయ్య, సగిలి రమేష్, షరీఫ్, సిడిపివోలు, శ్రీదేవి, లక్ష్మీదేవి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యా లయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శీదేవి, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎంపీ డీవో రవి కుమార్‌రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలి ంతలు, ఎంఎస్‌కెలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చెన్నూరు :** గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నట్లయితే తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన వైఎస్ఆర్ పోషణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిది గా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.ఎన్ .భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు చీర సురేష్ యాదవ్, వైస్ ఎంపిపి ఆర్.ఎస్ .ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఆర్.వి సుబ్బారెడ్డి, రఘురాంరెడ్డి, నిత్య పూజ య్యా, టి. ఎన్ చంద్రరెడ్డి, దిలీప్ రెడ్డి, పెడబలి ప్రతాపరెడ్డి, ప్రదీప్ కుమా ర్‌రెడ్డి, ఎంపి డిఒ సురేష్‌బాబు, ఐసిడిఎస్ అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కడప హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులుగా విశ్వనాథరెడ్డి

కడప అర్బన్ : కడప జిల్లా ఎలిమెంటరీ, సెకండరీ టీచర్స్ కో– ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన అధ్యక్షులుగా చెల్లా విశ్వనాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో అధ్యక్షునిగా పనిచేస్తున్న లక్ష్మీరాజా రాజీనామా చేయడంతో ఖాళీ అయిన అధ్యక్ష స్థానానికి ఎన్నిక నిర్వహించగా విశ్వనాథరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పబ్బాపురం హౌస్ బిల్డింగ్ సొసైటీలో అనేక సవాళ్లున్నాయని వాటిని సమర్థవంతంగా పరిష్కరించి సొసైటీ సభ్యులకు న్యాయం చేస్తానని స్పష్టం చేశారు తన మీద పెట్టిన గురుతర బాధ్యతలను విధిగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక మైనార్టీ ఎంఆర్‌డి కాలనీకి చెందిన ఖాదరున్నీస (30) బుధవారం మృతిచెందారు. ఈ సమాచారాన్ని వైసిపి యువనాయకులు అన్వర్‌బాష, జుమన్, అబ్దుల్‌రబ్ కలిసి వైసిపి అధికార ప్రతినిధి గుమ్మా రాంజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు ఆయన వెంటనే స్పందించి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మృతురాలి కుటుంబానికి అనివేళల్లా అందుబాటులో ఉంటామని తెలియజేశారు. అలాగే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ట్రస్ట్ ద్వారా మృతిరాలికుటుంబ సభ్యులు రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సాదక్ అలీ, నూర్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య తీరు దారుణం

స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి

ఆర్‌టిపిపి గేటు ముందు ధర్నా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వెన్నపూస సుబ్బిరెడ్డి

ఉద్యోగుల వేతన సవరణ విష యంలో యాజ మాన్యం తీరు దారుణంగా ఉందని స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల వేతన సవరణ, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లతో ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు ఆర్‌టిపిపి పవర్ గేటు ముందు బుధవారం ఉద్యోగులు , కాంట్రాక్టు కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటా డుతూ విద్యుత్ సంస్థల చరిత్రలో ఎప్పుడూ వేతన సవరణ ఆలస్యం కాలేద న్నారు. మూడు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇంక్రిమెంట్లు నిలుపుదల చేశారని, దీని ఫలితంగా ఉద్యోగులు 16 ఏళ్లుగా ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేస్తానని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని, కార్మికులకు మినిమం టైం స్కేల్, డైరెక్ట్‌గా విద్యుత్ సంస్థల యాజమాన్యాలే వేతనాలు ఇవ్వాలని కోరుతున్నామని చెప్పారు. ఇపిఎఫ్ ఉద్యోగులను జిపిఎఫ్‌లోకి మార్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్ట్రగుల్ కమిటీ కన్వీనర్ శివయ్య మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యానికి, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వాపోయారు. వెంటనే సవరణ ప్రకటించాలని కార్మికులకు తెలంగాణ తరహా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పరిమితి లేని మెడికల్ పాలసీని అమలు చేయాలని కోరారు. ధర్నాలో ఉద్యోగ సంఘ నాయకులు కొండారెడ్డి, వెంకటస్వామి, హరిఓబుల రెడ్డి, గిరిబాబు, శేఖర్, గంగాధర్, వెంకట్ కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గంగయ్య, పుల్లారెడ్డి, రాము, సాంబ శివారెడ్డి, నాగేంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని బోడెద్దులపల్లి ఉర్దూ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థిని మీద గేటు పడి మృతి చెందిన ఘటనపై విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం వారు పాఠశాలను సందర్శించి విద్యార్థిని మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని బోడెద్దులపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల విరామ సమయంలో పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలోని తన చెల్లెలి వద్దకు వెళ్లగా అక్కడ పాఠశాలలో నాడు నేడు పనులలో భాగంగా గేటును పాఠశాల గోడకు తగిలించి ఉండటంతో గేటు విద్యార్థినిపై పడిందని చెప్పారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థిని మృతి చెందిందని వారు అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే నాడు - నేడు పనులు ముగించాల్సి ఉన్నా పునః ప్రారంభించి రెండు నెలలవుతున్నా పూర్తి చేయ కుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని వారు అన్నారు. విద్యార్థిని మృతికి కారణమైన వారిపై హత్య కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. మృతిచెందిన విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల నష్ట పరిహారం చెల్లించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ నాయక్, నాయకులు రవి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు పాల్గొన్నారు.

ఎపిలో మీడియాకు పూర్తి స్వేచ్ఛ

కడప అర్బన్ : ఎపిలో మీడియాపై నియంత్ర లేదని, దేశంలో ఎక్కడా లేని స్వేచ్ఛ మనరాష్ట్రంలోని మీడియాకు ఉందని ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం హోటల్ మానస ఇన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా స్వేచ్ఛ పేరుతో కొన్ని ఛానళ్లు, పత్రికలు ప్రభుత్వంపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలైతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాయొచ్చని పేర్కొన్నారు. ఎంత విష ప్రచారం చేసినా ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. ఎపిలో కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వంపై పరిధి దాటి రాతలు రాయడం మానుకోవాలని హితవు పలికారు. కోవిడ్ సమయంలో కరోనాతో మరణించిన జర్నలిస్టులకు పరిహారం అందించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సమావేశంలో సమాచార శాఖ ఏడి పాల్గొన్నారు. **జగన్ ప్రభుత్వం దేశానికే ఆదర్శం..** వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఫోరం రాయలసీమ కన్వీనర్ లయన్ కె. చిన్నప రెడ్డి అధ్యక్షతన బుధవారం మానస ఇన్ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతోపాటు దేశంలో ఇతర రాష్ట్రాలు కూడా సచివాలయ వ్యవస్థను అమలు చేసేందుకు సిద్ధం కావడం జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌కు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సంస్థ రాయ లసీమ విభాగం కన్వీనర్ చిన్నపరెడ్డి, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శాంతమూర్తి, చార్య ఎన్. ఈశ్వర రెడ్డి అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ పోచం రెడ్డి సుబ్బారెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాఘవరెడ్డి, డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, డ్వాక్రా మహిళ చైతల్య, లయన్స్ క్లబ్ కడప. అన్నమయ్య మాజీ అధ్యక్షులు జ్యోజి రెడ్డి, రఫీ వైద్య ఆరోగ్యశాఖ సంఘం ప్రతినిధి వెంగళరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాల మాటేమిటి? : యుటిఎఫ్

కడప అర్బన్ : కేడర్ స్ట్రెంత్ అప్డేషన్ పేరుతో బదిలీ, ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు విమ ర్శించారు. బుధవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యో గోన్నతి, బదిలీ పొందిన ఉపాధ్యాయులకు రెండు మాసాలుగా జీతాలు చెల్లించకపోతే వారు ఎలా జీవించాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల నిర్లిప్తతవల్ల రెడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యో గోన్నతి, బదిలీ పొందినటువంటి దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు జీతాలు ఆగిపోయాయని పేర్కొన్నారు. ఇంటి అద్దెలు, గృహ రుణాల కంతులు, వ్యక్తిగత రుణాల కంతులు సక్రమంగా చెల్లించలేక అవస్థలు పడుతున్నారన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందిన తరుణంలో కేడర్ స్ట్రెంత్‌ను అప్డేట్ చేయడం కోసం నెలల తరబడి సమ యాన్ని వెచ్చించాల్సిన అవసరం లేదన్నారు. తక్షణమే సవరించిన కేడర్ స్ట్రెంత్‌ను ఆర్థిక శాఖ ఆమోదంతో రాష్ట్ర ఖజానా కార్యాలయానికి, తద్వారా 26 జిల్లాల ఖజానా కార్యాలయాలకు పంపి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. డిస్ప్లాయిడ్ కింద హై స్కూల్ ప్లస్ పాఠశాలలకు పీజీటీలుగా వెళ్లిన ఉపాధ్యాయులకు, ఎంఇఒ - 2గా వెళ్లిన ప్రధానోపాధ్యాయులకు జీతాలు చెల్లించేందుకు సత్వరం చర్యలు తీసుకో వాలన్నారు. జీతాల మంజూరులో ప్రభుత్వ, విద్యాశాఖ అధికారుల అలస త్వాన్ని నిరసిస్తూ ఈనెల 4న సాయంత్రం 5 గంటలకు జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలి పారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై నిరసన గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ర్యాలీ

కడప అర్బన్ : విద్యుత్ రంగంలో 45 శాతం ఫిట్‌మెంట్, కాంట్రాక్టు కార్మికుల క్రమద్దీకరణ డిమాండ్ల సాధన కోసం దశల వారి ఆందోళనలో భాగంగా బుధవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఎపి ఎస్‌పిడిసిఎల్ విద్యుత్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి స్ట్రగుల్ కమిటీ చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి, రామలింగారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాని పక్షంలో సమ్మెబాట పట్టేందుకు సిద్ధమవుతున్న విద్యుత్ ఉద్యోగ, కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు విధినిర్వహణలో తమ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి కీలకమైనటువంటి విద్యుత్ రంగంలో పనిచేయుచున్న ఉద్యోగులు, కార్మికులపై ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం చిన్నచూపు చూస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ఎన్‌జిఒ సంఘాలను లోబరుచుకొని తప్పుడు పిఆర్‌సి ప్రకటించిందని పేర్కొన్నారు. అదే పద్ధతిని విద్యుత్ రంగంలో కూడా ప్రయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యాలు కుట్ర చేస్తున్నాయని తెలిపారు. విద్యుత్ రంగం లోని కార్మి కుల పోరాట చరిత్రను, ప్రభుత్వాలు, యాజమాన్యాలు విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగుల పిఆర్‌సి, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, ఇతర సమస్యల పరిష్కారానికై పోరాటమే ఏకైక మార్గమని భావించి విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు తీసుకుని నిర్ణయం అభినందనీయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నాయబ్ రసూల్, హరి, కిరణ్, నాగ మల్లయ్య, ప్రతాప్ రెడ్డి, మద్దిలేటి, నాగ సుబ్బయ్య, పాల్గొన్నారు.

మహనీయులు.. 'పింగళి', 'బళ్లారి రాఘవ'

కడప అర్బన్ : జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య, తెలుగు నాటక రంగ ప్రముఖులు బళ్లారి రాఘవ మహనీయులని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఎస్‌పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య తెలుగువారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. భారత జాతీయోద్యమంలో పింగళి కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు. సత్యం, అహింసలను ఆచరించటం వల్ల దేశం సుభిక్షంగా ఉంటుందని విశ్వసించిన మహనీయుడని, ఆ స్ఫూర్తితోనే మహాత్మాగాంధీ సూచనలతో జాతీయపతాకానికి పింగళి రూపకల్పన చేశారన్నారు. పింగళి వెంకయ్య 1876, ఆగస్టు 2న కృష్ణా జిల్లా దివి తాలూకాలోని భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారని, 1921 మార్చి 31న విజయవాడలో జరిగిన భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో జెండాను రూపొందించి అందించారు. బళ్లారి రాఘవ తెలుగు నాటక రంగ ప్రముఖులు, న్యాయవాది, నాటకాలంటే ప్రత్యేకాభిమానం అన్నారు. హావభావ ప్రకటన లోను, డైలాగులు చెప్పడంలోనూ రాఘవ అసమానుడనిపించుకొన్నారన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

కలసపాడు : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పిడుగుపల్లి సచివాలయ పరిధిలోని ముద్దంవారిపల్లి, అక్కిసిద్ధిపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అర్హులైన వారికి ఏవైనా పథకాలు అందకపోతే వారికి వాలంటీర్ల ద్వారా అందజేస్తామని చెప్పారు. గ్రామాల్లో సిసి రోడ్లు, తాగునీరు, వీధిలైట్ల కోసం ఒక్కో సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున ప్రణాళిక సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలోపిడుగుపల్లి సర్పంచ్ గోవిందమ్మ, జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, ఎంపిపి నారాయణ, మాజీ ఎంపిపి సుధా రామకృష్ణారెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్, పురుషోత్తంరెడ్డి, జెఎస్‌సి మండల ఇన్‌ఛార్జి చితా రాజశేఖర్ రెడ్డి, లిడ్ క్యాప్ డైరెక్టర్ సగిలి సుదర్శన్, ఎంపిహెచ్ ఇఒ ఖాదర్‌బాష, బద్వేల్ సిడిఎంఒ శ్రీదేవి, పోరుమామిళ్ల ప్రాజెక్టు సిడిఎంఒ ఇన్‌ఛార్జి లక్ష్మీదేవి, రామాపురం, కలసపాడు సెక్టార్ సూపర్‌వైజర్లు హరిప్రియ, రత్నకుమారి, మాధవి, సుగుణ, చంద్రకళ, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఒఎస్‌డి

విద్య, వైద్య రంగాల్లో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకొచ్చి, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలి పారు. మండలంలోని కోరగుంటపల్లిలో బుధవారం నూతన ఆస్పత్రి భవనాన్ని, ఆర్‌బికెను ఎంపీ, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో నాడు-నేడు కార్యక్రమం ద్వారా నూతన భవనాలను ఏర్పాటు చేశారన్నారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ నాగరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ సుధాకర్‌రెడ్డి, అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి, వైసిపి మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వైద్యులు స్రవంతి, ప్రత్యూష, పిఆర్ డిఇ సుధాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి దొందూదొందే : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైసిపి, టిడిపి దొందూదొందేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి విమర్శించారు. వేంపల్లెలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయానికి ప్రధానమైందన్నారు. సాగునీటి రంగం గుండెకాయ వంటిదన్నారు. అలాంటి రంగానికి ఆ రెండు ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వార్షిక బడ్జెట్‌లో 15 శాతం సాగునీటి రంగంపై ఖర్చు చేసినట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వం 9 శాతం, వైసిపి ప్రభుత్వం 2 శాతం మాత్రమే ఖర్చు చేయడం దురదృష్టకరమన్నారు. వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లలో రూ 61,573 కోట్లు కేటాయించి, అందులో 31 శాతం రూ.19,199 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని ఆరోపించారు. శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జున సాగర్, ప్రకాశం, ధవళేశ్వరం బ్యారేజీలు కాంగ్రెస్ హయాంలోనే పూర్తయినట్లు తెలిపారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల్లో సింహభాగం కాంగ్రెస్ పాలనలోనే పూర్తయినట్లు వివరించారు. రాజకీయాలకు అతీతంగా సాగునీటి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలని టిడిపి, వైసిపికి తులసిరెడ్డి సూచించారు.

రూ.8.80 లక్షలతో కెసి కెనాల్ ఉప కాలువ నిర్మాణం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో కెసి కెనాల్ ఉప కాలువల నిర్మాణాల పనులను చేపడుతున్నారు. ఇందులో భాగంగా శ్రీరాములపేట గ్రామ పంట కాలువలో సిమెంట్ లైనింగ్ పనులు రూ.8.80 లక్షలతో జరుగుతున్నాయి. మండల పరిధిలో రూ.3 కోట్ల వరకు కెసి కెనాల్ కాలువ పనులు చేపడుతున్నారు. రాజువారిపేట, అనంతపురం, చియ్యపాడు, పల్లవోలు, అన్నవరం, ఓబుళరెడ్డిపేట గ్రామాల వద్ద పనులు జరుగుతున్నాయి. కెసి కాలువకు ఈ నెలలో నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున పనులు వేగవంతం చేశారు. సిమెంట్ లైనింగ్ కాలువలతో పొలాలకు నీరు సులభంగా చేరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


శ్రీరాములపేట వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ లైనింగ్ కాలువ

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

పార్టీలకతీతంగా వైసిపి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని నందిపాడు కాలనీ, పేరారెడ్డి కొట్టాల్, నందిపాడులో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు నవరత్నాల పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి భూస్థాపితం కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి బనగానపల్లె అబుబకర్ సిద్దిక్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు మున్వర్, ఉప మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్ రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బిటి రోడ్డు పనుల్లో అలసత్వం తగదు

- పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న బిటి రోడ్డు పనుల్లో అలసత్వం తగదని పాడా ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పనులపై ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు కొంత వరకు మొదలు పెట్టి తర్వాత అసంపూర్తిగా వదిలేయడం సరైన విధానం కాదన్నారు. అచ్చవెల్లి-గుండ్లమడుగు, ఈ.కొత్తపల్లె నుంచి జేకే రోడ్డు వరకు, నల్లపురెడ్డిపల్లె-ఫిరోజ్‌పూర్, హిమకుంట్ల-అంకేవానిపల్లె, గురజాల-వెన్నపూసపల్లె, రావులకొలను-ఇనగలూరు రోడ్డు పనుల్లో కొన్ని పనులు పూర్తి కాగా, మరికొన్ని మొదలుపెట్టారని, అలాగే నియోజకవర్గంలో ఏ రోడ్డు పనులు కూడా అసంపూర్తిగా కాకుండా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పీఆర్ ఈఈలు ఓబుళరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, డీఈ సుధాకర్‌రెడ్డి, పాడా కార్యాలయ అధికారులు రామాంజులరెడ్డి, శివశంకర్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె పేట గ్రామానికి చెందిన రొంపిచర్ల నాగేశ్వరరావు రెండవ వర్ధంతి పురస్కరించుకొని బుధవారం ఆయన కుమారుడు హరి ఆధ్వర్యంలో రేణిగుంట సమీపాన ఉన్న అభయ క్షేత్రంలోని అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయ క్షేత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఆశ్రమాలలో అన్నదానం చేయాలని, ఆశ్రమంలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామిరెడ్డి, నరసింహులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని ఏనుకొండపాలెం పంచాయతీ దిగువపాలెం, కదిరాయచెరువు పంచాయతీలలోని సచివాలయాలను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సచివాలయం సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సచివాలయాల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. సచివాలయాలలో సిబ్బంది సమయపాలన పాటించి సకాలంలో కార్యాలయానికి చేరాలన్నారు. ప్రజలతో మమేకమై సానుకూలంగా వారి పనులను చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ కార్యాలయంలోని పనులను చిత్తశుద్ధితో చేసి మండలానికి, జిల్లాకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సిబ్బంది పనితీరు సక్రమంగా లేకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రదీప్, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎంఇఒ మునీందర్‌నాయక్, సచివాలయం మండల కన్వీనర్ మోహన్‌రాజా నాయుడు, పంచాయతీ కార్యదర్శి జయచంద్ర, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

శోభాయమానం.. ఆహ్లాదకరం

- అన్ని సౌకర్యాలతో ఆకట్టుకుంటున్న సిటీ ఫారెస్ట్ పార్క్

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



పులివెందుల సిటీ ఫారెస్ట్ ముఖద్వారం


చిన్నపిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

పులివెందుల అభివృద్ధిలో భాగంగా నిర్మించిన సిటీ ఫారెస్ట్ (నగరవనం) శోభాయమానంగా, ఆహ్లాదకరంగా ఉంది. సిటీ ఫారెస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ ప్రాంతంలో ఒకప్పుడు కుటుంబాలతో కలిసి బయటికి వెళ్లి కొద్దిసేపు సరదాగా గడుపుదాం.. పిల్లలతో ఆడుకుందాం అనే భావనతో ఎక్కడికన్నా వెళ్లాలంటే ఒక్క పార్కు కూడా లేదు. అంతో ఇంతో పులివెందులలో అంబకపల్లి రోడ్డులో రాణితోపు ఉండేది. అదికూడా కొంత వరకు మాత్రమే బాగుండేది. మిగతా అంత కంపచెట్లతో గవినిలా కనిపించేంది. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో పులివెందులలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. అందులో భాగంగానే ఇక్కడ శిల్పారామం ఏర్పాటు చేశారు. పిల్లలతో అక్కడున్న ఆట వస్తువులతో ఆడించుకుంటూ.. అక్కడే ఏర్పాటు చేసిన బోటింగ్ చేయిస్తూ, అక్కడున్న ఆహ్లాదకర ప్రాంతంలో సేదదీరేవారు. దీంతోపాటు పులివెందులలో ఉన్న రాణితోపును విరివిరిగా నిధులు కేటాయించి దాన్ని కూడా అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. దీనికి ఇందిరమ్మ రాణితోపు అని పేరు పెట్టారు. ఇందులో ఔషధ మొక్కలను నాటించారు. ఆ మొక్కకు పేరు, ఆరోగ్యానికి ఏమి మేలు చేకూరుతుంది అనే విషయాలను బోర్డుపై రాయించారు. శని ఆదివారాల్లో ప్రజలు విరివిరిగా అక్కడికి తమ పిల్లలతో వచ్చి ఎంతో ఆహ్లాదకరంగా గడుపుతూ ఉండేవారు. ధ్యానం చేసుకునేందుకు వీలుగా అన్ని వస్తువులు సమకూర్చారు. రాజారెడ్డి పార్క్‌ను, జయమ్మ పార్కును ఏర్పాటు చేశారు. ఈ పార్కులు పులివెందుల ప్రాంత ప్రజలకే కాకుండా ఇతర ప్రాంతాల వారు కూడా అక్కడికి వెళ్లి కొద్దిసేపు గడిపేవారు. వైఎస్ మరణానంతరం ఇందిరమ్మ రాణితోపు పర్యవేక్షణ లోపంతో అక్కడ ఉన్న వస్తువులు దెబ్బతిన్నాయి. మళ్లీ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో పులివెందుల అభివృద్ధికి వేగంగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే పులివెందులలో రూ.639 కోట్లతో మోడల్ టౌన్‌లో పనులు చేపట్టారు. శిల్పారామంలో మరిన్ని వసతులు సమకూర్చేలా నిధులు కేటాయించారు. ఆ పనులు కూడా దాదాపు పూర్తి కావచ్చాయి. పలు పార్కులు కూడా రూపకల్పన చేసి అందులో వ్యాయామం చేసుకునే సామగ్రిలను ఏర్పాటు చేశారు. ఇందిరమ్మ రాణితోపునకు దాదాపు రూ.16.25 వేల కోట్లతో మొత్తం సిసి రోడ్లను ఏర్పాటు చేయించి, 10 నుంచి 12 స్టాల్స్‌ను అక్కడ ఏర్పాటు చేశారు. మొత్తం తోపు చుట్టూరా మొక్కలు నాటించారు. ప్రధాన గేటు ముందర ప్రత్యేకంగా ఏనుగు బొమ్మను తెప్పించి నెలకొల్పారు. వివిధ రకాల జంతువుల బొమ్మలను తెప్పించారు. యోగా, వాకింగ్ చేసుకునేందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు లేటెస్ట్ పరికరాలను కూడా అమర్చారు. ఇందిరమ్మ రాణితోపు అనే పేరును మార్చి సిటీ ఫారెస్ట్ అని పెట్టారు. నగర వనం అని కూడా పిలుస్తారు. జిల్లా పర్యటనలో భాగంగా సిఎం జగన్ జులై 9న పులివెందులలో పలు ప్రారంభోత్సవాల్లో భాగంగా పులివెందుల సిటీ ఫారెస్ట్‌ను ప్రారంభించారు.

మహిళల సంక్షేమానికి సిఎం జగన్ కృషి



మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మి గాయత్రి

ప్రజాశక్తి - వేంపల్లె

మహిళల సంక్షేమానికి సిఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని ఎంపిపి లక్ష్మి గాయత్రి చెప్పారు. స్థానిక గరుగువీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం మహిళల ఆరోగ్యం, పిల్లల పోషకాహారంపై ప్రత్యేకశ్రద్ధ చూపిస్తోందన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణలో భాగంగా పౌష్టికాహారం. రేషన్ పంపిణీ చేయడం శుభపరిణామమన్నారు. గత ప్రభుత్వాలు మహిళా సంక్షేమానికి కృషి చేయలేదని చెప్పారు. సమావేశంలో ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాం జనేయులు, సిడిపిఒ సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, బాలితలు పాల్గొన్నారు.

ముద్దనూరు : గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీ కేంద్రాల ద్వారా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ఇంటికే రేషన్ సరుకులు అందిస్తున్నారని ముద్దనూరు సర్పంచ్ బోనం సరళ, వైస్ ఎంపిపి పుష్పలత అన్నారు. స్థానిక ప్రాథమిక స్టేషన్ స్కూల్ ఆవరణలో బుధవారం సిడిపిఒ ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ రేషన్, తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఒ ముంతాజ్ బేగం, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు సాంబశివారెడ్డి, సూపర్‌వైజర్లు ప్రవీణ, ఉమారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : గర్భిణులు, బాలింతలకు రక్తహీనత సమస్య రాకుండా రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం సరఫరా చేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీతారామపురం సర్పంచ్ స్వాతి సూచించారు. మండల పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో వైయస్సార్ సంపూర్ణ పోషణ రేషన్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిఎంఎస్ కె.సరిత, ఎఎన్ఎం స్రవంతి, అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని వలసపల్లె రోడ్డులోని అంగన్వాడీ సెంటర్‌లో స్థానిక కౌన్సిలర్ కోకోకోలా గౌస్ చేతుల మీదుగా బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కో-కన్వీనర్ షర్ఫుద్దీన్, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌వల్లి, వైసిపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దువ్వూరు : యుపి పాఠశాలలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్‌రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ప్రతినెల మూడు కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, 500 గ్రాముల నూనె, ఐదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు అందజేస్తామని ఎంపిడిఒ జగదీశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు ధరణి, సౌజన్య, వరలక్ష్మి పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : సంపూర్ణ పోషణ బిడ్డల ఎదుగుదల, సంపూర్ణ రక్షణకు దోహదపడుతుందని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో అంగన్వాడీ సిడిపిఒ శ్రీలత ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వరప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణి, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కిషోర్, లక్ష్మీ భార్గవి, లక్ష్మీ ప్రసన్న, గంగాభవాని గుల్జార్, కాంతమ్మ, వైసిపి నాయకులు డేనియల్ బాబు, సిద్దయ్య అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : గర్భిణులు, బాలింతలు, తల్లులకు ఇంటి వద్దకే పోషకాహారాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోందని ఎంపిపి హరిత తెలిపారు. సాథనిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో బుధవారం వైయస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి, తహశీల్దార్ గుర్రప్ప, ఎంపిడిఒ రాఘవేంద్రనాథ్, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.


పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఎంపిపి హరిత

రోడ్డు పూర్తయ్యే వరకూ పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని కొత్త బస్వాపురం గ్రామంలోని సమస్యలపైన చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఐదవ రోజున ధర్మశెట్టి రాజేష్‌కు సిపిఎం మండల కార్యదర్శి గోవింద్ మద్దతిచ్చారు. రాజేష్‌కు పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ తెలుగుగంగ అంతర్భాగమైన బ్రహ్మసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురై సుమారు 40 సంవత్సరాలు గడుస్తున్నా కొత్త బస్వాపురం గ్రామానికి తెలుగుగంగకు వెళ్లే ప్రధాన రహదారి నుండి 650 మీటర్ల దూరం వరకు తారు రోడ్డుకు, సిమెంటు రోడ్డుకు గాని నోచుకున్న దాఖలాల్లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గ్రామానికి ఏళ్ల తరబడి సంబంధిత తెలుగుగంగ అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు గ్రామానికి తరచూ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ఏ ఒక్కరూ అధ్వాన్నంగా ఉన్న ఈ రోడ్డును పట్టించుకున్న పాపానపోలేదన్నారు. 15వ వార్డు మెంబర్‌తోపాటు గ్రామస్తులు రోడ్డు వేయాలని బిక్షాటన చేసినా, రిలే నిరాహార దీక్ష చేపట్టినా అధికారులు, నాయకులు స్పందించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పూర్తి చేసి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్, ఎద్దు రాహుల్, భాస్కర్, బిగ్‌బాస్ పాల్గొన్నారు.


దీక్షలకు మద్దతిస్తున్న సిపిఎం నాయకులు

యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం

ప్రజాశక్తి - కొండాపురం


తేనె తయారీని వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు కొయ్యగూర ప్రదీప్‌రెడ్డి. కొండాపురానికి చెందిన ప్రదీప్‌రెడ్డి ఎంబిఎ పూర్తి చేశారు. ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా, నిరాశకు లోను కాకుండా ప్రస్తుతం సమాజంలో ప్రజా అవసరాలను గమనించారు. అందుకు అనుగుణంగా సహజ వనరులను మలచుకొని జీవనోపాధి సాగించాలని అనుకున్నారు. ఆ మేరకు అడుగులు వేశారు. ప్రస్తుతం సమాజంలోని చాలా మంది ప్రజలు సహజ సిద్ధమైన ఆహార పదార్థాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ప్రదీప్‌రెడ్డి తేనె ఆవశ్యకతను గుర్తించారు. తేనె పెంపకంపై ఆసక్తి పెంచుకున్నారు. శిక్షణ పొందిన వెంటనే తేనె టీగల పెంపకం, తేనె తయారీ శ్రీకారం చుట్టారు.

ఎలాంటి మందులు వినియోగించని, కల్తీ చేయని తేనె పరిశ్రమ నెలకొల్పి మార్కెట్‌లో ఉంచారు. అధిక లాభాలతో వ్యాపారం చేస్తున్నారు. తన తెలివితేటలు, శ్రమపై ఆధారపడ్డారు. తగు మార్కెటింగ్‌ను కూడా ఎంచుకుని అధిక లాభాలతో ముందుకెళుతున్నారు. ప్రస్తుతం ప్రదీప్‌రెడ్డి తన తేనె పరిశ్రమ ద్వారా మరి కొందరికి జీవనోపాధి కూడా కల్పిస్తున్నారు. ఇలా ఆయన నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులు చేపట్టి యువతకు ఉపాధి కల్పించడమే తమ ద్యేయమని ప్రదీప్‌రెడ్డి తెలిపారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

బి.కొత్తకోట : రైతన్నల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. పిటిఎం మండలం దేవప్పకోట, మద్దయ్యగారిపల్లిలో బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను రారాజులు చేసేందుకు సిఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎంపిపి మహమ్మద్, ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి, మద్దయ్యగారిపల్లి ఎంపిటిసి సయ్యద్‌బాషా, సర్పంచ్ రామంజులు, మడుమూరు సర్పంచి నాగరత్న భాస్కర్ నాయుడు, కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, సచివాలయం కన్వీనర్ రమణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

లంపీ స్కిన్ వ్యాధికి టీకాలే శరణ్యం

తంబళ్లపల్లి : పశువులకు వచ్చే లంపీ స్కిన్ వ్యాధికి టీకాలే శరణ్యమని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ సుమిత్ర తెలిపారు. బుదవారం మండలంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువులలో దోమలు, ఈగల ద్వారా లంపీ స్కిన్ వ్యాధి వస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి సోకితే పశువులు డిలా పడడం జ్వరంతో మేత మెయ్యక పశువు పూర్తిగా డిలా పడుతుందన్నారు. వంటిపై దద్దుర్లు రావడం, పుడ్లు గా మారడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు ఈ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి పశువుకు టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భారత జాతికి వన్నె తెచ్చిన వ్యక్తి పింగళి వెంకయ్య

ప్రజాశక్తి - వేంపల్లె


పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రినిపల్, సిబ్బంది

భరత జాతికి వన్నె తెచ్చిన వ్యక్తి పింగళి వెంకయ్య అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ సమగ్రత, సౌభ్రాతృత్వం, ఐక్యత కోసం పాటు పడాలని కోరారు. పింగళి వెంకయ్య స్వాతంత్ర్య సమర యోధుడుతో పాటు భారతదేశ జాతీయ పతాక రూపకర్త అన్నారు. 1916లో భారత దేశానికి ఒక జాతీయ పతాకం అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారని చెప్పారు. 19 ఏళ్ల వయసులోనే దేశభక్తిపై ఉన్న ప్రేమతో దక్షిణాఫ్రికాలో జరిగిన రెండవ బోయర్ యుద్ధంలో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. గాంధీతో వెంకయ్యకు ఏర్పడిన సాన్నిహిత్యం అర్ధశతాబ్దం పాటు నిలిచిందని వివరించారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి పింగళి వెంకయ్య అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం యూనిట్-2 అధికారి డాక్టర్ మల్లేశ్వరమ్మ, ఐక్యూఎసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

నిధులున్నా.. నిర్లక్ష్యం

- ఎవరికీ పట్టని సోమిరెడ్డిపల్లి పాఠశాల

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం


దెబ్బతిన్న సోమిరెడ్డిపల్లె పాఠశాల

నిధులున్నా మండలంలోని సోమిరెడ్డిపల్లె పాఠశాల నిర్లక్ష్యానికి గురైంది. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. అయితే ఈ పాఠశాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిధులు మంజూరైనప్పటికీ పాఠశాల యాజమాన్యం పనులు చేయించడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. పనులు చేయకుండా మూడు లక్షల రూపాయల డబ్బు డ్రా చేసినట్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అధికారులు విచారించి వాస్తవమేనని తేల్చారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి చొరవచూపడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేకచొరవతో పాఠశాలను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు చాపాడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల సర్వ సభ్య సమావేశాన్ని ఎంపిపి టి.లక్షుమయ్య అధ్యక్షతన గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు మంగళవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. అధికారులు పూర్తిస్థాయి నివేదికతో తప్పక రావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల సమస్యలను సమావేశం దృష్టికి తేవాలని ఆయన కోరారు.

5న ముద్దనూరు..

ముద్దనూరు : ఈ నెల 5న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో ముద్దనూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సమావేశంలో విద్య, వైద్య, ఉపాధి, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, పారిశుధ్యం, జగనన్న గృహాలు, పశు పోషణ తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

జనం లేక వెలవెలబోయిన చంద్రబాబు రోడ్‌షో

ప్రజాశక్తి - జమ్మలమడుగు


మాట్లాడుతున్న బడిగింజల చంద్రమౌళి, విజయలక్ష్మి

ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు జమ్మలమడుగు పట్టణంలో నిర్వహించిన రోడ్ షోకు జనం లేక వెలిసి పోయిందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి పేర్కొన్నారు. స్థానిక విజ్ఞాన్ స్కూల్ అవరణలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తుందని చంద్రబాబు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబు తాను అధికారంలో ఉండగా ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ కూడా పూర్తి చేయకుండా.. నీళ్ల, ప్రాజెక్టులంటూ రోడ్డెక్కిన చంద్రబాబును చూసి రైతులు నవ్వుకుం టున్నార న్నారు. ఆయన 14 ఏళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం గుర్తుకు రాలేదాని ప్రశ్నించారు.

విశ్వం కళాశాలకు న్యాక్ 'ఎ' గ్రేడ్ సర్టిఫికేట్

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక అంగల్లు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల న్యాక్ 'ఎ' గ్రేడ్ సర్టిఫికెట్ పొందినట్లు కళాశాల కారెస్పాండెంట్ చైర్మన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో న్యాక్ సిబ్బంది కళాశాలలో పర్యటించి, గత ఐదు సంవత్సరాల పూర్వపు వివరాలను పరిశీలించారని అన్నారు. కళాశాలలో వివిధ డిపార్ట్మెంట్ల వసతులు, విద్యార్థులకు అందించిన ఉద్యోగ అవకాశాలను గుర్తించారని అన్నారు. కళాశాలలో అత్యాధునిక ల్యాబోరేటరీ, డిజిటల్ లైబ్రరీ, హాస్టల్స్, క్యాంటీన్స్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, బస్సు సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారని అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, పూర్వపు విద్యార్థులను, ప్రస్తుతం ఉన్న విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను విడివిడిగా మీటింగులు పెట్టి, వారి అభిప్రాయాలు తెలుసుకొన్నారని అన్నారు. అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారని అన్నారు. విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్ కు నాక్ ఎ గ్రేడ్‌ను ప్రదానం చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్‌లో క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇంప్రూవ్ చేయడంలో వెనుకాడమని, ఇప్పుడు వచ్చిన నాకు ఏ గ్రేడ్ ద్వారా మాపై బాధ్యతగా పెరిగిందన్నారు. రాబోయే విద్యార్థులందరికీ ఇంకా మెరుగైన వసతులు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని సంతోషాన్ని వ్యక్తపరిచారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రమణయ్య

కలకడ : మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రమణయ్య బాధ్యతలు చేపట్టారు. బుధవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో 2013, 2015 సంవత్సరాలలో రెండు పర్యాయాలు ఇదే కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించానన్నారు. ఎన్నో కళాశాలలో 23 సంవత్సరాలు విధులు నిర్వహించిన అనుభవం ఉందని తెలిపారు. 2022వ సంవత్సరంలో తాను చేసిన అధ్యాపక వృత్తికి ప్రభుత్వం గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును పొందినట్లు తెలిపారు.